సంపుటి :02 సంచిక :217 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్


www.aksharadarbar.com Voice of the people

## నగర రహదారుల సమాచార నమోదుకు యాప్

బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఐసీసీసీ కేంద్రంలో ఆకస్మికంగా పర్యటన



05



## గురుకులంలో విద్యార్థిని బలవన్మరణం

- టీచర్ సెల్ నుంచి తల్లిదండ్రులకు కాల్
- ఆ తర్వాత చున్నీతో ఉరి వేసుకున్న విద్యార్థిని
- కేసు నమోదు చేసిన పోలీసులు

04

శుక్రవారం 24, అక్టోబర్ 2025


# బతుకులు బుగ్గి

ఏపీలోని కర్నూలులో ఘోర ప్రమాదం

19 మంది సజీవ దహనం






- హైదరాబాద్ నుంచి ఇద్దరు డ్రైవర్లు సహా 41 మందితో బయల్దేరిన బస్సు
- బెంగళూరు వెళ్తుండగా బైక్ ఢీకొని బస్సులో మంటలు
- డోర్లు తెరవకుండా పరారైన ఇద్దరు డ్రైవర్లు
- అగ్నికీలల్లో 19 మంది ప్రయాణికులు సజీవ దహనం
- పలువురి గాయాలు.. వారిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- డీఎన్ఏ పరీక్షల ఆధారంగా మృతదేహాల అప్పగింతకు చర్యలు

02



అంతా గాఢనిద్రలో ఉన్నారు. అదే వారికి ఆఖరి ప్రయాణమని తెలియదు. ఉన్నట్టుండి పెద్దశబ్దం. బస్సంతా మంటలు. దావానలంలా అగ్నికీలలు. అరుపులు.. హాహాకారాలు.. తేరుకునేలోపు అంతా అయిపోయింది. బస్సు అస్తిపంజరం గూడులా మిగిలింది. 19 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. కొందరు స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడగలిగారు. ఈ ఘోర ప్రమాదం ఏపీలోని కర్నూల్ జిల్లాకేంద్రం శివారులో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. హైదరాబాద్ నుంచి గురువారం రాత్రి 10:30కు బెంగళూరుకు బయల్దేరగా, కర్నూల్ శివారులోకి వచ్చేసరికి బస్సును బైక్ ఢీకొట్టింది. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో బస్సులోని అద్దాలు పగలగొట్టి కొందరు కిందకు దూకేశారు. మరికొందరు బస్సులోనే అగ్నికి ఆహుతైపోయారు.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



## సీసీఐ కేంద్రాల్లోనే పత్తి అమ్మండి

- కపాస్ కిసాన్ అప్ లో స్లాట్ బుకింగ్ తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

03

## జూబ్లీహిల్స్ బరిలో 58 మంది

- నియోజకవర్గంలో 4,01,365 మంది ఓటర్లు
- ప్రతి పోలింగ్ బూత్‌లో నాలుగు బ్యాలెట్ యూనిట్స్
- తుది జాబితా విడుదల చేసిన జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్



04

## పార్టీలకు అతీతంగా అభివృద్ధి

అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

04



# బతుకులు బుగ్గి

## ఏపీలోని కర్నూలులో ఘోర ప్రమాదం



**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి:**

ఏపీలోని కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేమూరి కావేరి ట్రావెల్స్ కు చెందిన బస్సు హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి ఇద్దరు డ్రైవర్లు సహా 43 మందితో బెంగళూరు బయల్దేరింది. జాతీయ రహదారి 44పై వెళ్తుండగా అర్ధరాత్రి 2– 3 గంటల ప్రాంతంలో చిన్నటేకూరు గ్రామం చేరుకోగానే బస్సును బైక్ ఢీకొట్టింది. బైకర్ కింద పడిపోగా, బైక్ బస్సు కిందకు దూసుకెళ్లింది. బైక్‌ను బస్సు 300 మీటర్ల వరకు లాక్కెళ్లింది. బైక్ ఈ క్రమంలో బస్సు ఆయిల్ ట్యాంకర్‌కు బలంగా తగిలింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి పెట్రోల్ లీక్ అయింది. దీంతో మంటలు చెలరేగి బస్సులో మంటలు చెలరేగాయి. అవి క్రమంగా బస్సంతటా వ్యాపించాయి. అప్పటికే గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు తేరుకొని హాహాకారాలు చేస్తూ కొందరు బయటపడగా, పలువురు మంటల్లోనే చిక్కుకున్నారు. అగ్నికీలల్లో 19 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. 22 మంది ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్లలో ఒకరు పరారవగా, మరో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు. పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ హుటాహుటిన అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని కర్నూలు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారే. మృతుల కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది.



- హైదరాబాద్ నుంచి ఇద్దరు డ్రైవర్లు సహా 41 మందితో బయల్దేరిన బస్సు
- బెంగళూరు వెళ్తుండగా బైక్ ఢీకొని బస్సులో మంటలు
- డోర్లు తెరవకుండా పరారైన ఇద్దరు డ్రైవర్లు
- అగ్నికీలల్లో 19 మంది ప్రయాణికులు సజీవ దహనం
- పలువురి గాయాలు.. వారిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- డీఎన్‌ఏ పరీక్షల ఆధారంగా మృతదేహాల అప్పగింతకు చర్యలు

### - బస్సును ఢీకొట్టిన బైకర్ మృతి

అలాగే బస్సు ప్రమాదంలో బస్సును ఢీకొట్టిన బైకర్ సైతం మృతిచెందాడు. మృతుడిని కర్నూలు మండలం ప్రజానగర్‌కు చెందిన శివశంకర్‌గా నిర్ధారించారు. పెళ్లిచూపులు చూస్తున్న సమయంలో శివశంకర్ మృతిచెందడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. శివశంకర్ అర్ధరాత్రి బైక్‌పై ఎందుకు జాతీయరహదారిపై వెళ్తున్నాడో తెలియదని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు.

### - వేగవంతంగా విచారణ

ప్రమాదం తర్వాత పోలీసులు రంగంలోకి దిగి పరారీలో ఉన్న డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు ప్రమాదానికి గల కారణాలను ఆరా తీస్తున్నారు. బస్సులోని మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా కాలిపోయాయి. డీఎన్‌ఏ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేసేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రమాదంపై 16 బృందాలతో అన్ని కోణాల్లో పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నారు. డీఎన్‌ఏ పరీక్షల కోసం 10 ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. ప్రమాదానికి కారణాలు అన్వేషించేందుకు మరో నాలుగు బృందాలు, రసాయన విశ్లేషణ కోసం రెండు బృందాలు పనిచేస్తున్నాయి. ప్రమాదంపై కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ.. రోడ్డుపై పడి ఉన్న బైకును బస్సు ఢీ కొట్టినట్లు తాము అదుపులోకి తీసుకున్న డ్రైవర్ చెప్పాడని, అంతకుముందే రోడ్డు ప్రమాదంలో బైక్ పడిపోయి ఉండొచ్చని ఎస్పీ అభిప్రాయపడ్డారు. బైకు పైనుంచి బస్సు వెళ్లడంతో మంటలు చెలరేగాయని, ప్రమాదానికి గల కారాణాలపై అన్ని కోణాల్లో విచారణ జరుగుతోందని తెలిపారు.

### 19 మంది మృతి: ఏపీ హోంమంత్రి అనిత

కర్నూలు జిల్లా బస్సు ప్రమాద ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఏపీ హోంమంత్రి అనిత ధ్రువీకరించారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 39 మంది పెద్దవాళ్లు, నలుగురు చిన్నారులతోపాటు గుర్తు తెలియని మరో వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. ప్రమాదం నుంచి ఇద్దరు డ్రైవర్లు సహా 27 మంది బయటపడ్డారని, స్వల్ప గాయాలతో ఆస్పత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని వివరించారు.

### - ప్రాణాలతో బయటపడిన వారు వీరే..

సత్యనారాయణ– సత్తుపల్లి, జైసూర్య– మియాపూర్, నవీన్‌కుమార్– హయత్‌నగర్, సరస్వతి హారిక– బెంగళూరు, నేలకుర్తి రమేశ్– నెల్లూరు, కటారి అశోక్– రంగారెడ్డి జిల్లా, ముసునూరి శ్రీహర్ష– నెల్లూరు, పూనుపట్టి కీర్తి– హైదరాబాద్, వేణుగోపాల్‌రెడ్డి– హిందూపురం, రామిరెడ్డి– ఈస్ట్ గోదావరి, డ్రైవర్ లక్ష్మయ్య, డ్రైవర్ శివనారాయణ. మృతుల్లో ఏపీ, తెలంగాణ నుంచి ఆరుగురు చొప్పున, ఒడిశా, బిహార్ నుంచి ఒక్కొక్కరు, తమిళనాడు, కర్ణాటక నుంచి ఇద్దరు చొప్పున ఉన్నారన స్పష్టం చేశారు. మరొకరి మృతదేహం గుర్తించాల్సి ఉందని వివరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



### - డ్రైవర్ నిర్లక్ష్యంతోనేనా..

బస్సు ముందు భాగంలో మంటలు అంటుకోవడంతో పక్కకు ఆపిన డ్రైవర్, వాటిని ఆర్పేందుకు ప్రయత్నించాడు. అయితే ప్రమాదాన్ని తక్కువగా అంచనా వేసిన డ్రైవర్, ఫైర్ సేఫ్టీ సిలిండర్‌తో కాకుండా సాధారణ వాటర్ బబుల్‌తో మంటలు ఆర్పేందుకు యత్నించాడు. కానీ అప్పటికే పరిస్థితి చేయి దాటిపోవడంతో భయపడిన డ్రైవర్ వెంటనే తోటి డ్రైవర్‌ను లేపాడు. ఇద్దరు కలిసి ప్రయాణికులను అప్రమత్తం చేయాల్సింది పోయి అక్కడి నుంచి పారిపోయారు. పారిపోయేటప్పుడు కనీసం బస్సు డోర్లు కూడా తెరవలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదంలో హైడ్రాలిక్ కేబుల్స్ తెగి పోవడంతో డోర్ తెరుచుకోలేక చాలామంది బస్సులో నుంచి బయటకు రాలేకపోయారని తెలిపారు. కొంతమంది మాత్రం అద్దాలు పగులకొట్టుకుని బయటకు దూకేశారని పేర్కొన్నారు. అదే బస్సు డ్రైవర్ డోర్ ఓపెన్ చేసి ఉంటే 80 శాతం వరకు ప్రాణ నష్టం తగ్గి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు.



# సీసీఐ కేంద్రాల్లోనే పత్తి అమ్మండి

- కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

అక్షరదర్బార్, జనగామ: పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. జనగామ మండలంలోని, ఓబుల కేశవపూర్ గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర కాటన్ ఇండస్ట్రీస్ లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.8,110గా నిర్ణయించిందని, 8 నుంచి 12 వరకు తేమ శాతం ఒక్కో శాతం పెరిగిన మేరకు ధర కూడా ఒక శాతం తగ్గుతుందన్నారు. 12 కంటే ఎక్కువ తేమ శాతం ఉన్న పత్తిని సీసీఐ వారు కొనుగోలు చేయరని... రైతులందరు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ఇంటి దగ్గరే పత్తిని ఆరబెట్టుకొని సరైన తేమ శాతం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ సారి రైతుల సౌకర్యార్థం, పత్తి కొనుగోళ్లలో స్లాట్ బుకింగ్ విధానం ఉందని, పత్తి రైతులందరూ ఖచ్చితంగా, ముందస్తుగా కపాస్ కిసాన్ అప్ ద్వారా, జిన్నింగ్ మిల్లు ఎంపిక చేసుకొని, స్లాట్ బుక్ చేసుకొని, ఆ బుకింగ్ చేసుకున్న తేదీ ప్రకారం, సరైన తేమ శాతంతో తీసుకు వచ్చి, తమ పత్తిని అమ్ముకొని, కనీస మద్దతు ధర రూ. 8,110 క్వింటాల్ కి పొందాలన్నారు. స్లాట్ బుక్ చేసుకునే విధానం వల్ల రైతులు జిన్నింగ్ మిల్లుల వద్ద రోజుల తరబడి వెయిట్ చేసే అవసరం ఉండదని అన్నారు. స్లాట్ అందుబాటులో ఉన్నది చూసుకొని దాని ప్రకారం సరిగ్గా తేమ ఉంచుకొని, జిన్నింగ్ మిల్లుకు తీసుకువచ్చి ఎటువంటి ఇబ్బంది లేకుండా పత్తి అమ్ముకోవాలని



సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి నరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్, మార్కెట్ కమిటీ మెంబర్స్, సీసీఐ అధికారులు నర్సిరెడ్డి, జీన్నింగ్ మిల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు



# బ్యాంకుల వద్ద దళారుల దందా

- రైతుల అవసరాలే ఆసరాగా నిలువుదోపిడీ
- బంగారం, క్రాప్ లోన్లు చెల్లించి కమీషన్లు వసూలు
- కేసముద్రం బ్యాంకుల్లో దళారుల హవా

అక్షర దర్బార్, కేసముద్రం: వ్యవసాయ సీజన్ మొదలయ్యాక రైతులు పంట పెట్టుబడుల కోసం రుణాలపై ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కేసముద్రం మండలంలోని పలు బ్యాంకుల వద్ద దళారులు బీభత్సం సృష్టిస్తున్నారు. బంగారం లేదా క్రాప్ లోన్ విడిపించేందుకు ఇబ్బంది పడుతున్న రైతులకు దళారులు తామే చెల్లిస్తామని చెప్పి ప్రతి రూ.50 వేలపై రూ.1,000–1,500, లక్ష రూపాయలపై రూ.2వేలు–3వేలు వరకు కమీషన్ వసూలు చేస్తున్నారు. ఇక బ్యాంకు సిబ్బందితో సత్సంబంధాలు కలిగి, దళారులు నేరుగా క్యాబిన్‌లలోకే ప్రవేశించి పనులు చక్కబెట్టుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తమ విత్‌డ్రా ఓచర్లు ముందుగానే తీసుకుని ఖాతాలో డబ్బులు పడగానే కమీషన్ తీసుకుంటున్నారని వాపోతున్నారు. రైతులు ఆర్థికంగా చితికిపోతుండగా, దళారుల దందా మరింతగా ముదురుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిబంధనలను సడలించి రైతులను రక్షించాలని వారు విజ్ఞప్తి చేశారు.




# మల్లక్కపేట ఆలయంలో నిర్మాణాలకు భూమి పూజ

అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలంలోని మల్లక్కపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం స్నాన గదులు, టాయిలెట్ల నిర్మాణానికి శుక్రవారం ఆలయ చైర్మన్ అంభీరు మహేందర్ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, అర్చకులు కట్కూరి జగన్నాథచార్యులు, ఆలయ పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





# బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్

అక్షర దర్బార్, నర్సంపేట: వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గానికి చెందిన ఓర్సు రాజేందర్‌ను బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జ్ ద్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ బీసీ సమాజ అభివృద్ధి, ఐక్యత కోసం క్షేత్ర స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనన్న, రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రాజు, జిల్లా అధ్యక్షుడు ద్యాగల శ్రీనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఓర్సు సాంబయ్య, ఓర్సు శ్రీనివాస్, మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, ఓర్సు ముత్తయ్య, ఇంద్రయ్య, సాయికుమార్, సారంగం, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పగలే వెన్నెల..

## పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు



అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలంలోని పలు గ్రామపంచాయతీలలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో వీధి లైట్లు పట్టపగలే వెలుగుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి కరెంట్ బిల్లుల రూపంలో నష్టం జరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి లైట్లు ఆన్–ఆఫ్ చేయకపోవడం వల్లే ఈ సమస్య వస్తోందని స్థానికులు పేర్కొంటూ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# 'చిన్న కాళేశ్వరం' భూసేకరణపై సమీక్ష



అక్షర దర్బార్, భూపాలపల్లి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన శుక్రవారం ఐడీఓసి సమావేశ మందిరంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ మొదటి, రెండో దశల భూ సేకరణపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్న కాళేశ్వరం అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్ట్ అని, భూ సేకరణను అత్యవసరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు తగిన పరిహారం అందించి, పునరావాస కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టు పురోగతిపై వారానికి ఒకసారి సమీక్షలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎస్‌డీసీ రమేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమ కుమారి, ఇరిగేషన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను నాగుర్ల ఆశీర్వాలు

అక్షర దర్బార్, పరకాల: హసన్‌పర్తి మండలంలోని సాయిని గార్డెన్స్‌లో మోతే పుష్పలత–రవీందర్ రెడ్డి దంపతుల కుమారుడు శశిధర్ రెడ్డి – సాయి ప్రసూన రెడ్డి వివాహ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, నాయకులు తిరుపతి రెడ్డి, సమ్మిరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.



# సబ్సిడీని రైతులు వినియోగించుకోవాలి



అక్షర దర్బార్, పరకాల: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఎస్ఎమ్ఏఎం–2025 పథకంలో నడికూడ మండలానికి వివిధ వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై కేటాయించబడినట్లు ఎంఏఓ పోరిక జై సింగ్ తెలిపారు. బ్యాటరీ/మాన్యువల్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, రోటావేటర్లు, బ్రష్ కటర్లు, పవర్ వీడర్లు, స్ట్రా బేలర్లు, టిల్లర్లు, ట్రాక్టర్ పనిముట్లు వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా చిన్నకారు రైతులకు 50%, ఇతరులకు 40% సబ్సిడీ అందించబడుతుందని తెలిపారు. రైతులు అక్టోబర్ 31లోగా పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, ఫోటో, బ్యాంక్ ఖాతా జిరాక్స్, ట్రాక్టర్ యంత్రాల కోసం ఆర్‌సీ పేపర్తో దరఖాస్తు చేసుకోవాలని ఎంఏఓ కోరారు.

# గౌడకాలనీలో దుర్గంధం..

- పట్టించుకోని అధికారులు
- తీవ్ర ఇబ్బందుల్లో కాలనీవాసులు



అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండల కేంద్రంలోని గౌడ కాలనీలో నివాసులు దుర్వాసనతో విసుగెత్తిపోతున్నారు. కాలనీకి వెళ్లే సీసీ రోడ్డు పక్కనున్న మురికిగుంటలో నీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఆ మురికిగుంట పక్కనే ఇళ్లు ఉండడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఆ గుంటలో పందులు తిరుగుతుండటం, ఈగలు, దోమలు పెరగడంతో ప్రజలు రోగాల బారిన పడే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు గౌడకాలనీ ప్రజలు నల్లబెల్లి గ్రామపంచాయతీ కార్యదర్శికి విన్నవించారు. మురికినీటిని కాలువల ద్వారా బయటికి పంపించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలను రోగాల నుండి రక్షించాలని వారు కోరుతున్నారు.

# విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి

- సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: ఘనపురం మండలంలోని ఎంజేపీ స్కూల్, మోడల్ స్కూల్ లను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఏ.నాగరాజ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వంట గదులను, డైనింగ్ హాల్స్, టాయిలెట్స్, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నాణ్యతమైన భోజనం అందించాలని, మంచి చదువు బోధించాలని ప్రిన్సిపాల్స్ కు సూచించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడుతూ బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలన్నారు. లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించడం కోసం శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో ఘనపురం ఎస్ఐ అశోక్, న్యాయసేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.





# జూబ్లీహిల్స్ బరిలో 58 మంది

- నియోజకవర్గంలో 4,01,365 మంది ఓటర్లు
- ప్రతి పోలింగ్ బూత్ లో నాలుగు బ్యాలెట్ యూనిట్స్
- తుది జాబితా విడుదల చేసిన జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్

అక్షరదర్బార్, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో 58 మంది నిలిచినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ శుక్రవారం ప్రకటించారు. అలాగే నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను ప్రకటించారు. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 2,08,561 మంది పురుషులని, 1,92,779 మంది మహిళలని వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జూబ్లీహిల్స్‌లో 2,383 మంది ఓటర్లు పెరిగారని స్పష్టం చేశారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం పట్టుబడిందని వెల్లడించారు. ఉప ఎన్నిక బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నందున ఒక్కో పోలింగ్ బూత్‌లో నాలుగు బ్యాలెట్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగిస్తామని స్పష్టం చేశారు.

- నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి..

ఇక ఇంత మంది పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014లో 21 మంది, 2018లో 18 మంది పోటీ పడ్డారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 19 మంది పోటీ పడ్డారు. ఈ 19 మందిలో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన మాగంటి గోపీనాథ్ గెలుపొంది వరుసగా రెండోసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. కాంగ్రెస్ పార్టీని ఓడించడమే లక్ష్యంగా ఫార్మాసిటీ, ట్రిపుల్‌ఆర్ బాధితులు, నిరుద్యోగులతో పాటు వివిధ వర్గాలకు చెందిన వారు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లను దాఖలు చేయగా, 186 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.



# పార్టీలకు అతీతంగా అభివృద్ధి

- అన్ని డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా శుక్రవారం 57, 59 డివిజన్లలో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను నగర మేయర్ గుండు సుధారాణి గారితో కలిసి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనులను చేస్తున్నామని, ప్రతి డివిజన్ లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో డివిజన్ల పర్యటన చేయనున్న తరుణంలో ప్రతి కాలనీలో ప్రజల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# గురుకులంలో విద్యార్థిని బలవన్మరణం

- టీచర్ సెల్ నుంచి తల్లిదండ్రులకు కాల్
- ఆ తర్వాత చున్నీతో ఉరి వేసుకున్న విద్యార్థిని

అక్షరదర్బార్, హనుమకొండ: భీమదేవరపల్లి మండలం వంగరలో పీవీ రంగారావు గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని శ్రీవర్షిని (15) ఆత్మహత్య చేసుకుంది. హుజూరాబాద్ మండలం రాంపూర్ కు చెందిన శ్రీవర్షిని దీపావళి పండుగ సెలవుల తర్వాత శుక్రవారం ఉదయం తిరిగి గురుకులానికి వచ్చింది. అనంతరం ఉపాధ్యాయురాలి మొబైల్ నుంచి ఆమె తల్లిదండ్రులకు కాల్ చేసింది. తనను వెంటనే తీసుకెళ్లాలని, ఇక్కడ ఉండనని మొరపెట్టుకుంది. దీంతో తల్లిదండ్రులు తీసుకెళ్లేందుకు పాఠశాలకు వస్తున్నామని బదులిచ్చారు. ప్రార్థన సమయం కావడంతో విద్యార్థులందరూ బయటకు రాగా శ్రీ వర్ష కనిపించలేదు. కొద్దిసేపటి తర్వాత గురుకుల పాఠశాలలోని డార్మెంటరీ రూంలో విద్యార్థిని చున్నీతో ఉరివేసుకొని తోటి విద్యార్థులకు విగతజీవిగా కనిపించింది. విద్యార్థిని ఆత్మహత్యతో తోటి విద్యార్థినులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐలు దివ్య, ప్రవీణ్ కుమార్ చేరుకొని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సబ్సిడీపై యంత్రాలు

అక్షర దర్బార్, శాయంపేట: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా (SMAM – సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్) 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను శాయంపేట మండల రైతులకు వివిధ వ్యవసాయ పరికరాలు సబ్సిడీతో అందజేయనుంది. బ్యాటరీ, పవర్ స్ప్రేయర్లు, రోటావేటర్లు, కల్టివేటర్లు, బండ్ ఫార్మర్, బ్రష్ కట్టర్స్, పవర్ టిల్లర్, స్ట్రా బేలర్, ఎరువు-విత్తన డ్రిల్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ మరియు మహిళా చిన్నసన్నకారు రైతులకు 50% సబ్సిడీ, మిగతా రైతులకు 40% సబ్సిడీ లభిస్తుంది. వ్యవసాయ పరికరాలు పొందదలచిన రైతులు అక్టోబర్ 31లోపు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ఫారం, ఆధార్, పాసుపుస్తకం జిరాక్స్ మరియు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అవసరం.



# చిన్నారికి బీఆర్ఎస్ శ్రేణుల ఆశీర్వాదాలు

అక్షర దర్బార్, నల్లబెల్లి : మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర కవిత – రజినీకర్ దంపతుల కూతురు విష్ణు ప్రియ శారీ ఫంక్షన్ శుక్రవారం జరగగా వేడుకలకు నల్లబెల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, క్లస్టర్ ఇంచార్జి మామిళ్ళ మోహన్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు పిండి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి లెంకాల సాయిలు, మాజీ సర్పంచులు దాసి రాజ్ కుమార్, లావుడ్య తిరుపతి, ఊరటి అమరేందర్, మాజీ, ఎంపీటీసీ సంగ పోశాలు, మాజీ గ్రామ అధ్యక్షుడు కూస లింగయ్య, కుంట మల్లయ్య, ఎల్లబోయిన సుధాకర్, పాక్స్ డైరెక్టర్ శ్రీపతి కొమురయ్య, మాజీ ఉప సర్పంచ్ కర్నూరి సురేందర్, ఇమ్మడి రమేష్, పొన్నాల యుగేందర్, చల్ల రాజయ్య, సొనబోయిన రాజయ్య, ముకుంద రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

# అమరవీరుల త్యాగాలు వృథా కావు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- కమిషనరేట్ కార్యాలయంలో రక్తదాన శిబిరం



అక్షరదర్బార్, హనుమకొండ: పోలీస్ అమర వీరుల త్యాగాలు వృథా కావని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకుని వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్, ట్రాఫిక్, స్థానిక పోలీస్ స్టేషన్ల అధ్వర్యంలో రెడ్ క్రాస్ రక్తనిధి సహకారంతో పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని రాణి రుద్రమదేవి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బంది యువతకు స్ఫూర్తి కలిగించే రీతిలో ముందుగా సీపీ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ఆర్మ్‌డ్ రిజర్వ్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాదు సేవా కార్యక్రమాల్లోనూ ముందు వరసలో ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, సత్యనారాయణ, నాగయ్య, జాన్ నర్సింహులు, జితేందర్ రెడ్డి, ఆర్ఐలు సతీష్, శ్రీధర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, స్పర్జన్, రాజ్, హన్మకొండ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు డా.విజయ్ చందర్ రెడ్డి, ఈవీ శ్రీనివాస్ రావు, రమణారెడ్డి పాల్గొన్నారు.

# పరీక్షలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి

- టైంకి తినాలి.. టైం కి చదవాలి
- సమయాన్ని వృధా చేసుకోవద్దు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



అక్షరదర్బార్, జనగామ: జనగామ మండలం పెంబర్తి గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బిసి బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా స్టాఫ్ రూమ్ కి వెళ్లి టీచర్ల అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను చూసి ఎప్ప టికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం టెన్త్ క్లాస్ తరగతిలోకి వెళ్లి విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు అయింది, ఎలా ప్రిపేర్ అవుతున్నారు, రోజుకి ఎన్ని గంటలు కష్టపడుతున్నారు, స్టడీ అవర్ లో ఏం చదువుతున్నారు, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా తదితర వివ రాలను ప్రిన్సిపాల్ చంద్రమోహన్ ని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీ క్షలకు ప్రత్యేక కార్యాచరణ పెట్టుకొని ఇప్పటి నుండే ప్రిపేర్ అవ్వాలని, ఏ ఒక్క రోజు సమయం వృధా చేయకూడదన్నారు. ఏ టైంలో చేసేది అదే టైంలో చేయాలని, టైం కి తిని తొందరగా పడుకొని.. పొద్దున్నే లేవాలన్నారు. హార్డుగా ఉన్న సబ్జెక్టులను ఒకటికి రెండు సార్లు రివిజన్ చేసుకొని స్టడీ హావర్ టైంలో వీక్ ఉన్న సబ్జెక్టు పైన ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ఎస్ఏ 1 పరీక్షల్లో ఏ విద్యార్థికి ఏ ఏ సబ్జెక్ట్ లో ఎన్ని మార్కులు వచ్చాయి అని రిపోర్టును పరిశీలించారు. ఇక్కడ స్కూల్ లో విద్య బాగుందని, వేరే ప్రాంతం నుంచి వచ్చి మీ తల్లిదండ్రులు ఈ స్కూల్లో జాయిన్ చేపించారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా మంచిగా కష్టపడి పదవ తరగతి పరీక్షల్లో బాగా మార్కులు వచ్చేలా విద్యార్థులు కష్టపడాల న్నారు. ఉపాధ్యాయులు కుడా పదవ తరగతి విద్యార్థుల మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఏ సబ్జెక్ట్ లో ఏ విద్యార్థి వీక్ గా ఉన్నారో ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. అవసరం ఉన్న విద్యార్థులకు పలు మార్లు రివిజన్ చేస్తూ వారు ఆయా సబ్జెక్ట్ ల్లో రాణించేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# దళారులకు అమ్మి మోసపోవద్దు

- పత్తి రైతులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచన



అక్షరదర్బార్, భూపాలపల్లి: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణరావు అన్నారు. భూపాలపల్లి మంజూరున గర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పత్తి రైతు సూచనలను తెలిపే గోడ పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రమంతా ఈ నెల చివరి వారంలో పత్తి కొనుగోలు ప్రారంభమవు తున్న దృష్ట్యా పత్తి రైతులు పత్తిని అమ్ముకోవడానికి సెంటర్లకు వెళ్లే ముందుగానే కపాస్ కిసాన్ అప్లికే షన్ని డౌన్లోడ్ చేసుకుని, స్లాట్ బుక్ చేసుకుంటే పత్తిని ఇష్టమైన మిల్లుకు విక్రయించడానికి సౌలభ్యంగా ఉందన్నారు. ఆధార్ లింక్ తోనే డబ్బులు రైతు ఖాతాలో జమవుతాయని తెలిపారు. రైతులందరూ ముందుగానే ఆధార్ కార్డును కావల సిన బ్యాంకుకు లింకు చేసుకోవాలన్నారు. దళారుల వద్ద పత్తిని రైతులు ఎట్టి పరిస్థితిలో అమ్మరాదని తెలిపారు. పత్తికి మద్దతు ధర 2025-26 ఆర్థిక సంవత్సరంలో క్వింటాల్ కు రూ.8110 నిర్ణయించి నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సంవత్సరం సక్రమంగా పత్తి కొనుగోలు జరిగేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ సెక్రటరీ మహమ్మద్ లా షరీఫ్ తదితరులు ఉన్నారు.

# కలెక్టర్ తో ఎంపీ సమావేశం

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, ప్రత్యేక ప్రాజెక్టుల పురోగతిపై కలెక్టరేట్ లో శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్యశారదతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి మంజూరైన పలు స్కీములు, ప్రజాప్రయోజన పనులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ జిల్లా అభివృద్ధి వేగం మరింత పెంచడానికి కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియో గించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్ళను వెంటనే క్లియర్ చేసి ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. జిల్లాలో రహ దారులు, నీటి పారుదల, విద్య, ఆరోగ్య విభాగాల్లో ప్రాధాన్యత ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు కేటాయిం చేలా ప్రయత్నాలు చేస్తానని ఎంపీ డా కడియం కావ్య తెలిపారు. వరంగల్ అభివృద్ధి విషయంలో వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో తన గళాన్ని వినిపిస్తానని ఎంపీ స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు ఆశిస్తున్న అభివృద్ధి దిశగా కృషి చేస్తానని ఎంపీ పేర్కొంటూ, వరంగల్‌ను జాతీయ స్థాయిలో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యం అని తెలిపారు.



# వరంగల్ ఆర్డీవోగా సుమ



అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా టి సుమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్నా ళ్లు వరంగల్ ఆర్డీవోగా పని చేసిన కే సత్య పాల్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పా ల్వంచ ఎస్ ఆర్ ఎల్ ఐపీ యూనిట్ 2 ఎస్ డీసీ (ఎల్ ఏ)గా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేసిన టి సుమ వరంగల్ ఆర్డీవోగా నియ మితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురు వారం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన సుమ మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ సత్యశార దను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్డీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

# కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ను సందర్శించిన కలెక్టర్



అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థి నులకు అందిస్తున్న నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ కోచింగ్ గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు. కిచెన్ షెడ్ ను పరి శీలించి విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హనుమ కొండ జిల్లా డిటిడిఓ ప్రేమ కళ, ఆర్సీఓ డీఎస్ వెంకన్న, ప్రిన్సిపల్ పద్మిని, అధ్యాప కులు కలెక్టర్ వెంట ఉన్నారు.



# నగర రహదారుల సమాచార నమోదుకు యాప్

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- ఐసీసీసీ కేంద్రంలో ఆకస్మికంగా పర్యటన

అక్షరదర్బార్, వరంగల్: నగరంలోని రహదారుల సమాచార నమోదుకు అప్ రూపొందించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో గల ఐసీసీసీ కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి చెత్త వాహన కదలికల సమాచారాన్ని అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రధాన కార్యాలయంలో గల ఐసీసీసీ కేంద్రంలో తెరల పైన చెత్త తరలింపు వాహనాల కదలికలను, ట్రాన్స్ఫర్ స్టేషన్ లలో కొనసాగుతున్న పనితీరు, జీపీఎస్ ట్రాకింగ్ తో పాటు నగరంలోని పలు పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఐసీసీసీ కేంద్రం ద్వారా వచ్చిన సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో రివిల్ చేయాలని, పోతన నగర్ సెకండ్ ట్రాన్స్ఫర్ ఫర్ స్టేషన్ కు వాహనాలు ఏ విధంగా వెళుతున్నాయని వాల్ వీడియోలలో పరిశీలించారు. ఐసిసిసి కేంద్ర సిబ్బందితో మాట్లాడిన కమిషనర్ వారు చేయాల్సిన పని విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు.

# ఆ నిబంధన ఎత్తివేత హర్షణీయం

– బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



అక్షరదర్బార్, వరంగల్: రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇద్దరు పిల్లల నిబంధనను తొలగిస్తూ మంత్రివర్గ సమావేశంలో ఆమోదించడం పట్ల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం వ్యక్తం చేశారు. పిల్లలు అధికంగా ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు చెందినవారు గతంలో స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకపోవడం వల్ల రాజ కీయంగా వారు ఎదగలేకపోయారన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఈ వర్గాలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ముఖ్యమంత్రి వెంటనే అన్ని రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించి, అఖిలపక్ష బృందంతో ఢిల్లీకెళ్లి ప్రధానమంత్రిపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్
విప్లవంలో
భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం
QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా
వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915